క్లుప్తంగా

వృద్ధురాలికి సత్కారం



వెంగమ్మను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

లింగాల : మండలంలోని చిన్నకుడాల గ్రామంలో 108 ఏళ్ల వెంగమ్మను శనివారం తహసీల్దార్ ఈశ్వరయ్య, ఆర్ఐ రామగంగాధరరెడ్డి యాదవ్‌లు ఘనంగా సత్కరించారు. ప్రతి ఓటరు తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎల్ఓ హసనమ్మ, వీఆర్ఏ రాములమ్మలు పాల్గొన్నారు.

నేడు వైన్ షాపులు, మాంసపు దుకాణాలు బంద్

పులివెందుల టౌన్ : గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పులివెందుల పట్టణంలోని వైన్ షాపులు, మాంసపు దుకాణాలు ఉండవని మున్సిపల్ కమిషనర రాముడు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

ఇళ్లను లబ్ధిదారులే నిర్మించుకోవాలి

పులివెందుల టౌన్ : పులివెందుల జగనన్న హౌసింగ్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను లబ్ధిదారులే నిర్మించుకోవాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయ, అమెనిటీ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.హాజరై ఆయన మాట్లాడుతూ కాలనీలో గత ప్రభుత్వంలో రాక్రీట్ సంస్థ ఇళ్ల నిర్మాణాలను చేపట్టిందని, ప్రస్తుతం ఆ సంస్థ గడువు ముగియడంతో మిగిలిన ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులే నిర్మించుకోవాలన్నారు. పూర్తి చేసుకున్న ఇళ్ల యజమానికి బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, హౌసింగ్ డీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు : విద్యార్థులపై వత్తిడి పెంచుతూ ఆత్మహత్య చేసుకునేవిధంగా చేస్తున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లీలాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ప్రైవేట్ విద్యా సంస్థలలో జరుగుతున్న ఒత్తిడిని తగ్గించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు నిరసన వ్యక్తం చేశారు.

పట్టపగలు ఇంటిలో చోరీ

కొండాపురం : స్థానిక శాంతినగర్‌కు చెందిన కల్లూరు చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిలో శనివారం పట్టపగలే చోరీ జరిగినట్లు బాధితుడు తెలిపారు. పని నిమిత్తంపై చంద్రశేఖర్‌రెడ్డి బయటకు వెళ్లినప్పుడు తన భార్యకు మతిస్థిమితం ఉండటంతో దొంగతనానికి వచ్చిన వారిని గుర్తించలేకపోయిందన్నారు. ఇంటిలో 9 తులాలు బంగారు, రూ.80 వేలు నగదు పోయినట్లు బాధితుడు తెలిపారు.

బూడిద కింద పడితే చర్యలు

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీ నుంచి బూడిదను తీసుకుని వేళ్లే టిప్పర్లు, లారీల నుంచి రోడ్డుపైన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని లేని పక్షంలో వాహనాల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ నరేష్ బాబు హెచ్చరించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో వాహనదారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉపన్యాస పోటీలు

వేంపల్లె : పట్టణంలోని స్థానిక తలిశెట్టి శేషమ్మ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆర్యవైశ్య అఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అ సోసియేషన్ (అవోపా), ఆవోపా మహిళా విభాగ్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు.

ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన

మైలవరం : మండలంలోని వలంటరీ టీచర్లు ఉల్లాస్ కార్యక్రమం అమలుపై అవగాహన సదస్సును శనివారం ఎంపీడీఓ వై.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీఎం వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, వలంటరీ టీచర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు



సీఎస్ విజయానంద్‌తో అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ శివరామిరెడ్డి

కమలాపురం : స్థానిక తహసీల్దార్ శివరామిరెడ్డి బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు-2024 అందుకున్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సీఎస్ విజయానంద్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. 2024 ఎన్నికల్లో భాగంగా ఆ ఏడాది చేపట్టిన స్పెషల్ సమ్మరి రివిజన్ కార్యక్రమంలో ఏఈఆర్ఓగా విధులను విజయవంతంగా నిర్వర్తించినందుకు (ఎలక్టోరల్ రోల్ మేనేజ్‌మెంట్) గాను అవార్డు వచ్చిందన్నారు. 18 ఏళ్లు నిండి ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

మున్సిపాలిటీలో భర్తీ కాని పోస్టులు



ఎర్రగుంట్లలోని మున్సిపాలిటీ భవనం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో సిబ్బంది కొరత వేధిస్తుంది. సచివాలయ ఉద్యోగులను ఇన్‌చార్జిలు నియమించుకుని పరిపాలనను కొనసాగిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని చాలా వరకు అన్ని విభాగాలలో ఖాళీలు భర్తీ కాక కుర్చీలన్నీ ఖాలిగా ఉన్నాయి.

భర్తీకానీ ఖాళీలు..

మున్సిపాల్టీలో అసిస్టెంట్ ఇంజనీర్లు పోస్టులు -3, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్-1, టీపీఎస్-1, టీపీఓ-2, జూనియర్ అసిస్టెంట్-1, హెల్త్ ఆసిస్టెంట్-1 పోస్టులు భర్తీ కాక ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ ఏఈగా పనిచేసిన సురేష్‌బాబు పదోన్నతిపై డీఈగా పలమనేరు మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. మున్సిపాలిటీలో ఆరు మంది మహిళలు వివిధ విభాగాలలో పనిచేస్తున్నారు. వీరిలో మెటర్నటి సెలవుపై ఓ మహిళ వెళ్లింది. మెప్మా సంస్థలలో పనిచేస్తున్న టీఎంఎస్ నాగేంద్ర ఎర్రగుంట్ల, కమలాపురంలో పనిచేస్తున్నాడు. వారంలో మూడు రోజులు ఇక్కడ, మూడు రోజులు కమలాపురంలో విధులు నిర్వర్తిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ కూడా డిప్యూటేషన్‌పై కమలాపురం వెళ్లారు.

సచివాలయ ఉద్యోగులే దిక్కు

మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న పోస్టులకు సచివాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియమించుకున్నారు. రెగ్యులర్ పోస్టుల అధికారులు లేకపోవడంతో కొంత వరకు పరిపాలన స్తంభించే పరిస్థితి ఉంది.

మున్సిపాలిటీలో ఖాళీలు ఉండటం వాస్తవమే



ఎర్రగుంట్ల మున్సిపాలిటీలో ఖాళీలు ఉండటం వాస్తవమే. అయితే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు సచివాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులతో పనులు చేయిస్తున్నాము. రెగ్యులర్ సిబ్బంది వస్తే బాగుంటుంది.

శేషఫణి, కమిషనర్, ఎర్రగుంట్ల

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ చంద్రశేఖరరెడ్డి

వేముల : గ్రామీణ ప్రాంత మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పులివెందుల జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు జరిగినప్పుడు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నట్లయితే న్యాయం కోసం పోరాటం చేయవచ్చునన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని వివరించారు. అనంతరం మేజిస్ట్రేట్ చంద్రశేఖరరెడ్డిని ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వయోజన విద్యా పర్యవేక్షణాధికారి ఈశ్వరయ్య, ఏపీఎం ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శనివారం పులివెందుల సివిల్ కోర్టు జడ్జి చంద్రశేఖర్ రెడ్డి మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, వారి రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని, వారి కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించాయన్నారు. మహిళలు అన్ని రంగాలలో ఉన్నత స్థానాలు పొందాలని తెలిపారు. అనంతరం డ్వాక్రా మహిళలకు బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి, లాయర్లు, డ్వాక్రా సంఘాల మహిళలు, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1 నుంచి కాశీ మహా పాదయాత్ర

పులివెందుల టౌన్ : పులివెందులలో ఫిబ్రవరి 1వ తేదీన కాశీ మహా పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు శ్రీమద్భగవద్గీత ధర్మ ప్రచార సమితి మాజీ కార్యదర్శి మదూరు వెంకటశేషయ్య తెలిపారు. ఈ కాశీ మహా పాదయాత్ర దాదాపుగా 45 రోజులపాటు కొనసాగుతుందన్నారు. ప్రపంచ శాంతి కోసం, అందరూ బాగుండాలని ఈ పాదయాత్ర చేపట్టామని, ఈ పాదయాత్రలో పాల్గొనేవారు 9440223485 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

జమ్మలమడుగు : ఆర్టీసీ యాజమాన్యం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి కొన్నింటిని పరిష్కరించి మిగిలిన వాటిని పరిష్కరించలేదని వాటిని వెంటనే పరిష్కరించాలని మజ్దూర్‌యూనియన్ నాయకులు డిపో మేనేజరు ప్రవీణ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి శివుడు, వర్కింగ్ అధ్యక్షుడు ఓబుళరెడ్డి, గ్యారేజి కార్యదర్శి వలి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు



కమలాపురంలో విద్యార్థులతో కలసి ర్యాలీ చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు



జమ్మలమడుగులో సీనియర్ సిటిజన్‌ను సన్మానిస్తున్న ఆర్డీఓ

జమ్మలమడుగు : ఓటు భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆర్డీఓ సాయిశ్రీ తెలిపారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ సిటిజన్, నూతన ఓటర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా తమపేర్లను నమోదు చేసుకోవటానికి ఫారం-6 పూర్తి చేసి వివరాలను పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం : ఓటు ఆయుధం కంటే గొప్పదని, ఓటు వజ్రాయుధం అని, అర్హత ఉన్న ప్రతి పౌరుడు ఓటు హక్కు పొందాలని కమలాపురం డిప్యూటీ తహసీల్దార్ రోష్ని హుసేన్, ఎన్నికల డీటీ అహల్య తెలిపారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి నగర పంచాయతీ కార్యాలయం వరకు సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఉద్యోగులు, విద్యార్థులు, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐలు, వీఆర్ఓలు, వీఏఓలు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాల నారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు ఓటు హక్కు ప్రాధాన్యతపై వ్యాసరచన, క్విట్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎన్.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలని ట్రిపుల్ ఐటీ పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం ఇడుపులపాయలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 6, 8, 14లకు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు ప్రతీ యువతీ యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధుడిని సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, రెవెన్యూ అధికారి లోకేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దీప్తి, ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలి

కమలాపురం : ప్రతి విద్యార్థి తమ నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన సెకండియర్ ఈసీఈ విద్యార్థినులు శివ కవిత, లావణ్యలో స్టేట్ టెక్‌ఫెస్ట్‌లో ద్వితీయస్థానంలో నిలిచారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకుని విజేత విద్యార్థినులను అభినందించారు. అలాగే వారి విజయాలను గుర్తిస్తూ వారి ప్రతిభకు ప్రోత్సాహంగా రూ.10వేల నగదు బహుమతి ప్రకటించారు.

తృటిలో తప్పిన ప్రమాదం

కొండాపురం : మండలంలోని ముచ్చుమర్రి పునరావాస సమీపంలో శనివారం జాతీయ రహదారిలో కారు వైడర్‌ను ఢీ కొట్టింది. కారులో ప్రయాణం చేస్తున్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది.

పోస్టర్ల ఆవిష్కరణ

ఎర్రగుంట్ల పట్టణంలో ఆటో స్టాండ్ ఆవరణలో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను శనివారం ఆవిష్కరించినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి అన్వేష్ తెలిపారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో నెల్లూరు పట్టణంలో సీపీఎం రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యం

వేముల : గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశ్యమని ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం వయోజన విద్యా వలంటీర్లు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లకు ఉల్లాస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 480 మంది చదువురాని మహిళా వయోజనులకు చదువు నేర్పించే కార్యక్రమం ఉల్లాస్ ద్వారా చేపట్టాలన్నారు. వయోజన విద్యా సూపర్‌వైజర్ ఈశ్వరయ్య, ఏపీఎం ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

యూసీఐఎల్‌ను సందర్శించిన జెఎన్‌టీయూ విద్యార్థులు

వేముల : మండలంలోని తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టును శనివారం పులివెందుల జెఎన్‌టీయూ ఈసీఈ విభాగం విద్యార్థులు సందర్శించారు. అదునాతన మైనింగ్, ఖనిజ దాతువు ప్రాసెసింగ్ పద్ధతులను పరిశీలించారు. అనంతరం యురేనియం ప్రాజెక్టు మిల్లు జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్, మైనింగ్ డీజీఎం కిశోర్ భగత్‌లు అణుశక్తి ప్రయోజనాలు, సురక్షిత శక్తి ఉత్పత్తి వైపు విద్యార్థులను ప్రేరేపించారు. అలాగే యూసీఐఎల్ అన్ని యూనిట్లు, మైనింగ్ యొక్క అంశాల సమాచారాన్ని అందించారు. అలాగే జెఎన్‌టీయూ విద్యార్థులకు మెమెంటో, సమాచార బ్రోచర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యురేనియం ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతన్న చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ

జమ్మలమడుగు రూరల్ : మున్సిపాలిటీ అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేద్దాం అని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయ సభా భవనంలో బడ్జెట్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 2025-2026 సంవత్సరంకు అంచన బడ్జెట్ రూ.16,38,09,815ను కౌన్సిల్ సమావేశం అమోదించిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పెండింగ్ పనులను చేపడుతామన్నారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి నెల కౌన్సిల్ సమావేశం జరిగే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో చాల చోట్ల పందుల బెడద ఉందని అరికట్టడానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఅప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ముద్దనూరు : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ ముకుందరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్ సభాభవనంలో నిర్వహించిన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నివసిస్తున్న నిరక్షరాస్యులకు చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ముంతాజ్ బేగం, ఈఓపీఆర్డీ వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

పెసర పంటలో పంట కోత ప్రయోగాలు



పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామంలోని రైతు సుధాకర్‌రెడ్డి పెసర పంట పొలంలో శనివారం డీవైఎస్ఓ రామదాసు, ఏఎస్ఓ రమణమూర్తిలు పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెసర పంటలో గణనీయంగా దిగుబడులు తగ్గి ఉండొచ్చని అంచనా వేశామన్నారు. పూర్తి వివరాలు పంట కోత ప్రయోగాల ద్వారా తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో గురిజాల సచివాలయ వీఏఏ చరణ్, రైతులు పాల్గొన్నారు.

భారతదేశం చిత్రపటం ఆకృతిలో విద్యార్థులు



ముద్దనూరులో భారతదేశ చిత్రపటం ఆకృతిలో నిల్చున్న విద్యార్థులు

ముద్దనూరు : రిపబ్లిక్ డేను పురస్కరించుకున్ని స్థానికంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు భారతదేశం చిత్రపటం ఆకృతిలో నిల్చున్నారు.

కార్యాలయాన్ని తరలించడం సరి కాదు

జమ్మలమడుగు : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించడం సరైంది కాదని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పాత బస్టాండ్‌లో నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాయలసీమ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రగతి బ్యాంక్‌ను తరలించవద్దు అన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాష్ట్రీయ బాలల ఆరోగ్య పథకం ఓ వరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుభాషిణి

లింగాల : విద్యార్థులకు రాష్ట్రీయ బాలల ఆరోగ్య పథకం ఓ వరమని లింగాల ప్రభుత్వాసుపత్రి మెడికలాఫీసర్ డాక్టర్ సుభాషిణి తెలిపారు. శనివారం లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ పథకంలో భాగంగా రాష్ట్రీయ బాలల ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. హాజరైన ఆమె విద్యార్థులకు సమగ్ర సంపూర్ణ వైద్య పరీక్షలు నిర్వహించి.. విద్యార్థులలో ఎత్తు, బరువు, కంటి చూపు, రక్తహీనత ఇతర అనారోగ్య సమస్యలను గుర్తించి నమోదు చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివరాం, ఇన్‌చార్జి హెచ్ఎం రమేష్‌రెడ్డి, వికలాంగుల విద్యా సహాయకులు రఘునాథరెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కర్లింగ్ పోటీల్లో రాణించిన గురుకుల విద్యార్థులు



విజేతలతో డీసీఓ ఉదయ శ్రీ

కమలాపురం : స్థానిక బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు కర్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాణించారు. ఈనెల 15 నుంచి జమ్ము అండ్ కశ్మీర్‌లోని గుల్‌మర్గ్‌లో జరిగిన నాల్గవ జాతీయ కర్లింగ్ ఛాంపియన్ షిప్ -2025 పోటీల్లో పాల్గొన్న టెన్త్ విద్యార్థిని బి.దీక్షిత బాలికల విభాగం, మిక్స్‌డ్ డబుల్ విభాగంలో ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించింది. అలాగే 9వ తరగతి విద్యార్థిని బి. హారిక మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులకు డీసీఓ ఉదయ శ్రీ శనివారం స్థానిక కళాశాలలో మెడల్స్, ప్రశంసా పత్రాలతో అభినందించారు.

పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తాం



జె.ప్రవీణ్‌యాదవ్



షేక్‌మహబుబ్ బాషా



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న పార్టీ నాయకులు

కొండాపురం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో జమ్మలమడుగు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జె.ప్రవీణ్‌యాదవ్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ మహబుబ్‌బాషా నియమితులైన్నట్లు శనివారం వారు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రగుంట్ల : జమ్మలమడుగు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ పదవులు పొందిన వారు తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిని వారుఉ కలసి సత్కరించారు. జమ్మలమడుగు సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఆలీ, క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు ఎం ప్రశాంత్‌లు నూతన పదవులు పొందారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జయరామకృష్ణారెడ్డి, పార్టీ విద్యార్థి విభాగం నాయకులు షాహిద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సేవలకు ప్రతి రూపం వాసవీ క్లబ్



వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న క్లబ్ ప్రతినిధులు

పులివెందుల టౌన్ : సామాజిక సేవలకు ప్రతి రూపం వాసవీ క్లబ్ అని ఆ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కోశాధికారి రొట్టెల వినోద్‌కుమార్, మిట్టా మహేశ్వరగుప్తా, హరిశంకర్ తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నిరుపేదలకు నిత్యావసరాలను అందించారు. నూతన కార్యవర్గ సభ్యులతో డిస్టిక్ వి 206 ఏ గవర్నర్ ముచ్చర్ల రాధాకృష్ణమూర్తి, డిస్టిక్ క్యాబినెట్ సెక్రటరీ అనుమల వేణుగోపాల్, క్యాబినెట్ కోశాధికారి పబ్బతి గోపాల్, డిస్టిక్ వైస్ గవర్నర్ పెండ్యాల విజయకుమార్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త రవికుమార్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేసు శ్రీనివాసులు, వాసవీ క్లబ్ స్ట్రాటెడ్ అధ్యక్షులు మాలపాటి విజయకుమార్, డిస్టిక్ క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ దినేష్‌కుమార్, రీజనల్ చైర్ పర్సన్ నాగభూషణం, జోన్ చైర్ పర్సన్ మహేంద్ర బాబు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చదువురాని మహిళలకు విద్య నేర్పించాలి



మాట్లాడుతున్న వయోజనవిద్య డీడీ వెంకటసుబ్బారెడ్డి

చింతకొమ్మదిన్నె : స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉల్లాస్ పైన మండల లెవెల్ ట్రైనింగ్ కార్యక్రమంలో వయోజనవిద్య డీడీ వెంకట సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో చదువురాని మహిళలకు విద్య నేర్పించాలని వలంటీర్ టీచర్లకు పుస్తకాలు పంపిణీ చెశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుల్లాయిబాబు, వయోజనవిద్య సూపర్‌వైజర్ మహేశ్వరెడ్డి, వెలుగు ఏపీఎం రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, సీసీలు, వీవోఏలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీట్ బెల్టు, హెల్మెట్ తప్పక ధరించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసాద్

పులివెందుల టౌన్ : వాహనదారులు సీట్ బెల్టు, హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.వి.ప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో 36వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల భాగంగా విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. ద్విచక్ర వాహనాల్లో దూర ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ హాజీవలి తదితరలు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలకు స్పందన

కమలాపురం : మండలంలోని పశు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాలకు స్పందన లభించింది. శనివారం పందిళ్లపల్లె, పెద్దచెప్పలి పశు వైద్యాధికారులు మల్లికార్జున రెడ్డి, శివజ్యోతిల ఆధ్వర్యంలో కంచన్నగారిపల్లె, పెద్దచెప్పలి గ్రామాలలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. కంచన్నగారిపల్లెలో ఏర్పాటు చేసిన శిబిరంలో 24 పశువులకు సాధారణ చికిత్సలు, 8 గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 378 పశువులకు, 197 గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. అలాగే పెద్దచెప్పలిలో నిర్వహించిన శిబిరంలో సాధారణ చికిత్సలు, 17 గర్భ సంబంధిత చికిత్సలు, 3 పశువులకు ఎద సూదులు, 37 లేగ దూడలకు ఏలికపాము మందులు, 293 జీవాలకు నట్టల నివారణ మందు తాపించారు.

